# తెలిమంచు

**-వేంపల్లి అబ్దుల్ ఖాదర్**

"నిజం!...

అంత చిన్నమాట.... రాజు జీవితాన్ని ఇంత పెద్దమలుపు తిప్పుతుందని ఎవరూ ఊహించలేదు!

ooo

ఓ శీతాకాలపు సాయంకాలం

హైవే దిగి మట్టిబాటన ఔట్‌హౌస్ ముందు ఆగింది కారు.

డ్రైవర్ రాజు వెంటనే బ్యాక్ డోర్ తీసి నమ్రతగా నించున్నాడు.

పాలరాతి మీద తిరిగే పాదాలు పచ్చిక మీద నిలిచాయి.

ఆమె నడుస్తూ ఉంది.

అతను అనుసరిస్తూ ఉన్నాడు.

నాగరికత మెరుపుల్లో శరీర అవసరాలు పీకే ఆకలితో అందమైన యౌవ్వనాన్ని చౌకబారు సిగరెట్‌లా కాల్చేసి తనే కాలిపోయిన లేట్ నరసింహారావు - కామేశ్వరికి స్వయాన తాళికట్టిన మగడు. మిసెస్ కామేశ్వరికి బ్యాంక్‌లో బోలెడంత బ్యాలెన్సుంది. బ్యాలెన్స్‌లేని పిచ్చిపిచ్చి ఆలోచన్లున్నాయ్. ఆట్టే సంతృప్తినివ్వని రెండు కార్లు, ముచ్చటైన మూడు లోగిళ్ళూ ఉన్నాయ్. ఆ లోగిళ్ళకి సంక్రాంతి ముగ్గల్లే మిస్ కవిత! కవిత వయసు జెస్ట్ ఎయిటీన్. దానికి రెట్టింపు వయసు కామేశ్వరిది. ఆ అక్కా చెల్లెళ్ల మధ్య వయసు వాడు డ్రైవర్ రాజు.

"రాజూ!"

సంధ్యాకాశం కేసి చూస్తున్న రాజు తిరిగి చూశాడు.

పూజీ రంగుల్ని పులుముకుంటున్న పించానదిలో ఇప్పుడు దృశ్యం మారుతోంది.

వాన వాసనల్ని మోసుకొస్తోంది గాలి.

"వర్షం వచ్చేలా ఉంది! కారెక్కు. చినుకుల్లో ఇంచక్కా మాటాడుకుందాం!"

"మాడమ్?"

చిటపటల మధ్య వాళ్లిద్దరూ వచ్చి కార్లో కూచున్నారు. ఇకనేం? కారు అద్దాల మీద నీటి చిత్రాల్ని గీస్తున్నాయ్ చినుకులు!

ఏదో వింత అనుభూతి! మైమరపు!

"ఎస్మేడమ్"

"సీ.... పల్కరించే ఈ గాలి... పరవశం... పంచే ఈ వాన... గువ్వలా... రెక్కలార్చుకుంటున్న ఈ తడి ప్రకృతి... అహ్! ... నీకేమనిపిస్తోంది?...."

"... ... ... "

" ఏం పల్కవ్?"

"ఏమీ అనిపించట్లేదు"

"ప్రకృతి వర్ణనల మీదకదా పిహెచ్‌డి చేసింది?"

రాజు ఆశ్చర్యంతో తల ఎత్తాడు.

"మీ కెలా తెలుసు?"

"నీకు అవార్డు అయినట్టు ఫ్యాక్స్ వచ్చింది"

"ఔను. చేశాను!" పువ్వులా వికసించాడు.

"మరి... ఆ స్పందనేది?"

"ఉండదు"

"ఎందుకని?"

"స్పందన లేదు గనుక"

"అదే లేనిదెందుకని?"

"నాకు.. నేనే బందీని"

"అదే నాకు నచ్చట్లేదు... ఎందుకు నిరాశ? చదువుకున్న వాడివి. చక్కనివాడివి. యుషుడ్ ప్రిఫర్ వోన్లీ పాజిటివ్ థింకింగ్...."

నిశ్శబ్దం --

క్షణంలో సగం సేపు--

"రాజా!..."

"ఎస్మేడమ్"

"కళ్ళలో ఆ మెరుపేమిటి?... ఏమిటి నీ ప్రోబ్లెమ్స్?... అలా చేతులు కట్టుకు నించోవద్దన్నానా?"

"ఎస్మేడమ్.... బట్.... నా నిస్సహాయత ముందు నేనెప్పుడో ఆ పని చేశాను"

"ఎంత స్వాభిమానం నీకు? మరి... ఈ డ్రైవర్ ఉద్యోగమెందుకు చేస్తున్నావ్?"

"ఆకల్ని జయించాలని.."

"జయించావా?"

"లేదు"

"అభిమానం అన్నం పెట్టదు"

"స్వయం సంపాదనలోని సంతృప్తి చాలు నాకు"

"నాకలా అనిపించట్లేదు... ఎప్పుడో ఎక్కడో నువ్వు డిస్టర్బ్ అయ్యావ్... ఏదో దాస్తున్నావ్..."

రాజు నవ్వాడు నిశ్శబ్దంగా--

రెండు క్షణాల మౌనం --

"చూడు రాజూ! కొంచెం సుఖం... కొంచెం కష్టం.. ఈజీక్వల్టూ జీవితం. అది చాలా చిన్నది. అందులో యౌవ్వనం మరీ!.... నన్ను చూడు... యౌవ్వనం చల్లారని వయసులోనే.. మేజర్ పోయాడా? ఏడుస్తూ కూచున్నానా? లేదే!... ఇహ ఈ ట్రెడిషన్సంటావా? ఈ హద్దులన్నీ మనం గీసుక్కూచున్నవే! సంస్కృతీ చట్టుబండలని చెప్పే - చేతగాని వాళ్ళ డ్రై ఫిలాసఫీ అది..."

రాజు కాస్త అసహనంతో కదిలాడు.

"ఎస్.... ఏదో అడగాలనుకుంటున్నావ్ గదరా! అడుగూ...."

"మీలా మేజర్ కూడా ఆలోచించి ఉంటే..."

"గుడ్ క్వశ్చన్!... యునో? తనకి నచ్చిన ఫ్రెండ్‌ని ఇంటికి తీసుకొచ్చేవాడు మేజర్! ఎదురు చెప్పేదాన్ని కాదు. తన టేస్టుని నేనెందుకు కాదనాలి? వాళ్ల సంతోషాన్ని నేను గూడా షేర్ చేసుకునేదాన్ని! అదీ మా కో ఆపరేషన్. అప్పుడాయన కళ్ళని చూడాలి! ఎంత సంతృప్తితో మెరిసేవనీ? నా దృష్టిలో ఎడ్వెంచర్ లేని జీవితం జీవితమే గాదు...." అంటూ రాజు కళ్ళలో దేనికోసమో వెదికింది కామేశ్వరి!

దగ్గరగా....

ఇంకా దగ్గరగా....

ఏమో జరుగుతోంది...

వేడిగా తగిలింది ఊపిరి...

వాడిగా గుచ్చుకుంది కోరిక...

రాజు విండో గ్లాసు దించాడు.

చినుకులతో కలగలసిన వానగాలి మొరటుగా వచ్చి తాకింది.

ఐనా ... ఆమె తన్మయ ముద్ర చెదరలేదు.... మాటల కెరటాల మీద తేలి పోతోంది... "డాల్ఫిన్ నోస్ అందాల్ని చూశాను. కోణార్క శిల్పాల్ని చూశాను. వెన్నెట్లో పాలరాతి స్వప్నాన్ని చూశాను. నాకెక్కడా ప్రశాంతత చిక్కలేదు.." అంటూ సాంబ్రాణి ధూపంలా సుడులు తిరిగింది.

"మేడమ్... ప్లీజ్ రిలాక్స్... రిలాక్స్"

అంత చల్లోనూ ఆమె ముఖం మీద చిరుచెమటలు పుట్టాయి. ఆ కందరాల పొంగుల్ని రాజు చూడనైతే... చూశాడుగానీ... అసలా చూపు ఆమె ఆర్తిని ఏమాత్రం చల్లార్చ లేదు. మండే కొరివి మీద చన్నీళ్లు కొట్టినట్లు చప్పున చల్లారిన మనసు నుంచి రేగుతున్న ఎన్నో ప్రశ్నలు... " ఏవిటీ మగాడు? ఎంతకీ అర్థంగాడే.. ఒక వేళ ఇతగాడి మనసులో ఎవరైనా ఉన్నారా?"

ఆమె చూపు రాజుమీద నిలిచింది.

రాజు నిశ్చలంగా నవ్వుతున్నాడు. "మీరు పెద్ద వారు. పెద్ద కుటుంబం వారు. పెద్ద అంతస్తున్నవారు కూడా. ఈ ప్రలోభాలు చిన్నవి. చాలా చిన్నవి. వాటి ముందు మంచితనం చిన్నబోకూడదు. నేనూ మనిషినే. నాకూ ఉన్నాయ్ కోరికలు కానీ..."

చెప్పబోయేది ఊహించుకునే లోపే అప్పుడు జరక్కూడనిదొకటి జరిగింది!

హఠాత్తుగా పెదవులతో పెదవులు మూతబడ్డాయ్.

"పూజా....పూజా" అని అరిచాడు రాజు.

షాక్!

ఆ షాక్ నుంచి తేరుకుని నొసలు చిట్లించింది కామేశ్వరి - "అదెవరు?..."

ООО

శేషాచలం

'తలకోన' జలపాతం-

కాంక్రీట్ జంగిల్ సంస్కృతిలో విసిగిపోయిన జనం... ఎక్కడ చూచినా జనమే!

గెస్ట్‌హౌస్ ముందు కారు పార్క్‌చేసి పిక్నిక్ కిట్‌తో దిగాడు రాజు.

ఎదురుగా ఎగురుతున్న రంగు రంగుల సీతాకోక చిలకలు!

వాటితో పోటీ పడుతూ కవిత!

కవితకు ప్రకృతి అంటే ఎంతో ఇష్టం! ఇష్టంగాదు ప్రాణం! సూర్యకిరణాలు సూదుల్లా గుచ్చుకునే డీప్ ఫారెస్టంటే మరీను!

పక్షుల కిలకిలారావాలు-

పైర గాలుల పరవళ్ళు---

ఏటి ఒడ్డున చంద్రోదయాలు--

శిఖరాలు చిరునవ్వులు--

నవ్వుల జలపాతాలు--

జలపాతపు లోయలు--

ఇవన్నీ కవిత ఆకుపచ్చ స్వప్నాల్నే! నిజానికామె అభిరుచికి రాజు చాలా ముచ్చట పడేవాడు. చూపులతోనే అభినందనలు తెలిపే వాడు. కానైతే ఆమె అభిరుచి కేవలం ప్రకృతికే పరిమితం కాలేదు. సాహిత్యపు మూలాల్లో క్కూడా చొచ్చుకు పోయింది. రాజు ఊహల్లో కవిత ఓ నడిచే గ్రంథాలయం!

రవీంద్రుని రసకవిత-

షేక్స్‌పియర్ ట్రాజడీ-
మొపాసా ప్రేమ కైఫీయతు-
కృష్ణ శాస్త్రి హృదయంగమ గీతిక-
చలం సోషియల్ ఫిలాసఫీ-
శ్రీరంగం మరో ప్రపంచం

ఇలా దేన్ని తాకినా కవిత కవితై పలుకుతుంది! ఇంత చిన్న వయసులోనే మోడరన్ లిటరేచర్ మీద ఇంత పట్టు ఎలా సాధించిందో అర్థం గాదు. మరీ ఇంటరెస్టింగ్ ఊసేవిటంటే - కవిత కవితలు చెప్పే కళ్ళు! అందమైన ఆ కళ్ళు - నెలకోన డైవర్సన్న్ని, కిలోమీటర్ పొడవుతో పాకిపోయిన గిల్లతీగని, నెత్తిమీద శిలాతోరణాల్నీ, జావళిపాడే జలధారల్నీ, నీటి తుంపర్ల వెచ్చటి ఆవిర్లనీ చూస్తున్నాయ్!

"రాజూ!"

"ఎస్మేడమ్"

"అలా పిలవొద్దని చెప్పానా?"

"చెప్పారు"

"కవితా అని పిలు"

"... ... ..."

" ఏం మాట్లాడవ్?"

"మీరు యజమాని. నేను నౌకరు"

"అని ఎవరన్నారు?"

"నేనే "

"నేనలా అనుకోటం లేదు. ఎందుకంటే... నేన్నిన్ను ఇష్టపడుతున్నా...!"

## తోకలేని పిట్ట!

పాత
బంగారమైతే
గతం
వైభవమైతే
ఉత్తరం
బంగరు వైభవం!
దాని తోక
కత్తిరించకండి!
వెల పెంచితే
వెలవెల బోతుంది..
తపాలా దగ్గర దొరక్క
తిప్పలు పెడుతుంటే
అన్నం నాకు సహించదు!

-గుడిమెట్ల గోపాలకృష్ణ

రాజు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

ఆ పల్చటి సన్నటి మృదువైన చేతివ్రేళ్ళు రాజును ఆత్మీయంగా పలకరించాయ్. ఆ మరుక్షణం తీగలా అల్లుకుపోయింది కవిత.

దూరంగా ఏటి గుబురు నుంచి బొల్లి కోడొకటి అరిచింది.

రాజు ఉన్నపళంగా 'పూజా పూజా' అన్నాడు. శ్రుతి చేసిన వీణలా ఉన్న కవిత - శ్రుతి తప్పిన రాగంలా అయిపోయింది.

○○○

ఆలోచన్ల మధ్య నించున్న కామేశ్వరి ఎదురుగా ఉన్న చెల్లెలి కళ్ళలోకి చూచింది. "ఏదో చెప్పాలనుకుంటున్నావ్ కదూ?"

"ఔను"

"చెప్పూ"

"నేను రాజును ఇష్టపడుతున్నా"

"పెళ్లి కూడా చేసుకుంటావా?"

"నువ్వే ఒప్పించాలి"

"రాజు అభిప్రాయమేమిటో తెల్సుకున్నావా?"

"నువ్వే తెల్సుకోవాలి"

"ఆ అవసరం లేదనుకుంటున్నా"

"ఏం?"

"రాజు మనసులో నువ్వు లేవు. నిన్ను చేసుకోడు"

చివ్వున చూచింది కవిత - "అంత షూర్‌గ ఎలా చెప్పగలుగుతున్నావ్"?

"రాజు వాళ్ల ఊరెళ్ళొచ్చా"

"వెళితే?..."

"రాజు క్లాస్‌మేట్ మౌనిక చెప్పిన విషయాలు..."

"... ... ...."

"వింటావా?"

"చెప్పూ...."

కాసేపు తర్వాత నోరు విప్పింది.

"రాజు రాజేట... ఉన్నది ఒకే ఒక పూరిల్లు. ట్రైబల్ హాస్టలే తల్లీ తండ్రి. చెల్లెలు తప్పా నా అనే బంధా ల్లేవ్... కానీ... ఊరు ఊరంతా ఆత్మబంధువులే. అందరి అభిమానమే వాళ్ళని విద్యావంతుల్ని చేసింది.

ఐతే....

ఫైనలియర్ డిగ్రీ చేస్తున్న చెల్లెలి ప్రశాంత జీవితంలో అప్పుడొక కష్టమొచ్చి పడింది. ప్రేమించడమన్నది సాధారణమే కావచ్చు. కానీ... పెళ్లికి ముందే కడుపు రావడం సాధారణం కాదు.

జీవితం ఓ సమరమని తెలుసుకుని ఉంటే - రాజు చెల్లెలు ఆత్మహత్య చేసుకునేది కాదు. నూరేళ్ల జీవితాన్ని క్షణికావేశానికి ఫణంగా పెట్టి ఆమె చచ్చిపోయింది.

చెల్లెల్ని చరిత్రకు సాక్ష్యంగా నిలపాలనుకున్నాడు రాజు-

చెల్లెలి బ్రతుకు చరిత్రకు సాక్ష్యంగా మిగిలింది-

కాలం గడిచింది-

గాయం మానింది-

కానీ... గుర్తు మాత్రం నిలిచిపోయింది.

ఏ కాలమైతే రాజుని మోడుగా మార్చిందో ఆ కాలమే మౌనికను పెళ్లి కూతుర్ని చేసింది. మౌనిక పోస్టు గ్రాడ్యుయేట్ అయ్యింది. ఓ అండర్ గ్రాడ్యుయేట్‌ని చేసుకోబోతోంది. పెదవికి మించిన పళ్ళతో పెళ్ళి కొడుకు తుమ్మ మొద్దులా ఉంటాడు. పైగా పెడకన్ను. నడి వయసు. రెండో పెళ్లి. గుర్రం గుడ్డిదైనా దాణాకేం కొదవలేదు. కోరిన లాంఛనాలు కోరినట్టు సమకూరాయి!

నిజానికి...

మౌనికను ఆ పెళ్లికి ఒప్పించింది ఆమె ఆడతనం గాదు. అవిటి తనం?

అవిటితనం ఓ శాపమా?....

ఔనో కాదో తర్వాత జరిగిన సంఘటనలే ఋజువు చేశాయి.

కట్నం లాంఛనాలు ముందే ఇవ్వాలన్న పంతాలతో నిశ్చితార్థం కాస్తా ఆగిపోయింది. అందని ద్రాక్ష పళ్ళు. పుల్లనగాక మరేమౌతాయ్?

"ఈ కుంటి పిల్లని జీవితాంతం ఎవడు భరిస్తాడు? అఘోరించనీ..." అంటూ పెళ్లి కొడుకు టెక్కులు పోయాడు. నిశ్చితార్థానికి వచ్చిన జనమంతా పాలోమని వెళ్లిపోయారు. నిజానికా స్థితిలో మౌనిక ఏ ఆత్మహత్యో చేసుకోవాలి. అందరూ అదే అనుకున్నారు. కానీ మౌనిక అలా చేసుకోలేదు. చేసుకోదు. రాజు చెల్లెల్లా ఆమె పిరికిది కాదు. మనసు మీద పట్టు సాధించిన మనిషి. ఆత్మ విశ్వాసమూ, స్వాభిమానమూ ఆమెకు - రెండూ రెండు కళ్ళు!

○○○

లేతాకుపచ్చ సాయంకాలం-

గరిక పువ్వులా మౌనిక-

మౌనిక ఒడిలో రాజు-

"పెళ్లి తప్పిపోయిందిటగా?"

"ఔను"

"ఎందుకూ?"

"డబ్బుకే విలువకట్టే సమాజమిది"

"మనసుకే విలువనిచ్చే మనిషి ఇంకెప్పుడు దొరుకుతాడంటావ్?"

మౌనిక రోషంతో చూచింది "ఆ మనిషివి నువ్వే ఎందుకు కాకూడదు?"

రాజు నోట మాటరాలేదు-

కళ్ళలో మెరుపు - "నన్ను చేసుకోరా పెళ్ళని కాలరుచ్చుకు ఎందుకు అడగలేదే నువ్వు?" అని పసి పిల్లాడల్లే ఏడ్చాడు వెక్కి వెక్కి.

ఎన్నాళ్ళుగానో తన మనసులో ఉన్నమాట... అలా ఆ రూపంలో వచ్చేసరికి... ఉప్పెనలా ఎగిసిపడింది మౌనిక. ఊపిరాడని ముద్దులతో ముంచేసింది!... గుప్పెడు గుండెల్లో అంత బాధని ఎలా దాచుకుందో ఇన్నాళ్ళు?....

రాజు మనసులో ఆలోచన... నిద్ర లేచింది--

స్థాణువులా నిలబడిపోయాడు-

చెల్లెలి అర్థాంతర జీవితం కళ్ళ ముందు కదలాడేటప్పటికి 'పూజా... పూజా' అన్నాడు.

○○○

పొద్దు పొడిచింది-

గరిక కోణాల మీద మంచుబొట్లు మిలమిల మెరుస్తున్నాయి-

కన్నీళ్ళు జారుతుంటే కవిత నవ్వింది-

చెమరించిన కళ్ళల్లో మెరుపును దాచుకుంది కామేశ్వరి-

కామేశ్వరి ముందు నించున్న రాజుదీ అదే పరిస్థితి-

మనిషి స్థితిగతుల్ని శాసించే మనిషితనం... ఎప్పుడు... ఎందుకు మేలు కుంటుందో! కామేశ్వరి గుండె లోతుల్లో తొణుకుతున్న సంతృప్తి మాటల్లోకి పొంగింది.

"రాజు! నీ మంచితనం, నీ నిజాయితీ నాకు నచ్చాయి. జీవితాన్ని ఎంత లోతుగా ప్రశ్నించావ్? ఆ ప్రశ్నకు సమాధానం మౌనమేనని ఎంత గొప్పగా చెప్పావ్? నీలాంటి వాళ్ళకి సహాయపడని జన్మకి అర్థం లేదు..." అంటూ రెండు కవర్లిచ్చింది.

ఆ కవర్లలో ఉన్నవి...

రాజుకు...

మౌనికకు....

లెక్చరర్లుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు! ■